క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



నెక్కొండ : జిల్లా కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విధులతో పాటు అదనపు విధుల్లో భాగంగా నెక్కొండ పీఏసీఎస్ ప్రత్యేక అధికా రిగా ఈగ వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చిన వెంకటేశ్వర్లును కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతానని చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ మోడెం సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జీపీఓ

పర్వతగిరి: మండలంలోని కల్లెడ గ్రామంలో నూతన జీపీఓ రాపోలు నర్సయ్య విధులకు హాజరయ్యారు. ఈ మేరకు గ్రామస్తులు శనివారం నర్సయ్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదురుకోళ్ల రమేష్, సీనియర్ నాయకులు వడ్లకొండ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బాల్యసాయిలు, నీలం శ్రీనివాస్, దాసరి లచ్చయ్య, బురికి వెంకన్న, ఆకారపు రాములు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



నర్సంపేట: బీరప్ప కురుమ కుల సంక్షేమ సంఘం చెన్నారావుపేట మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ ఎలక్షన్ ఇన్‌చార్జ్ అమ్మ రాజేష్, బండి రాజ్‌కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కంకల రాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుండె కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడిగా బుర్రి యాదగిరిలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఈర నవీన్, కార్యదర్శిగా చిట్టి కుమారస్వామి, కోశాధికారిగా సిద్దన రమేష్, ముఖ్య సలహాదారులుగా మరాఠి కట్టయ్య, కెంచ అనిల్, మరాఠి రవి, కోరె రవి, మొర్రి వాసు, మేడి రమేష్, కోరె శివకుమార్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కడారి సాయిలు, అమీనాబాద్ గ్రామ ఇన్‌చార్జ్ మరాఠి రాజు, రాములు, మండల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్యకు ఘననివాళి



నర్సయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్లయ్య

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ రైతు సంఘం నాయకుడు గటిక నర్సయ్య 33వ వర్ధంతిని నెక్కొండ గ్రామీణ హితకారిని సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. హితకారిని సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటిక మల్లయ్య, కమ్యూనిస్టు పార్టీ వరంగల్ జిల్లా నాయకుడు కందిక చెన్నకేశవులు పాల్గొని నర్సయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ చింతనెక్కొండలో దొరల పెత్తందార్ల ఆగడాలు, దౌర్జన్యాలను దోపిడీ విధానాన్ని అణచివేసేందుకు నర్సయ్య ఎనలేని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, స్వామి, నర్సింహులు, వినయ్, చంద్రమౌళి, భాష్మియా, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల కార్యాలయాల ఎదుట ధర్నా



మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు ఆనందరావు

దుగ్గొండి : ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నా కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను పెంచుతామని ప్రకటించి నేటికి 20 నెలలు దాటిపోయిందన్నారు. ఆసరా పింఛన్లను పెంచకపోతే స్థానిక ఎన్నికల్లో ప్రజాగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి గురికాక తప్పదన్నారు. సమావేశంలో నాయకులు కొలగాని రవి, పర్లపెల్లి సదానందం, నల్లబెల్లి పద్మ, కర్ణం చిన్నకట్టయ్య, బొటికె లచ్చమ్మ, నల్లబెల్లి భిక్షపతి, పాణి, రాందాసు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి వెళ్లాలంటే కష్టమే..

- బురదమయంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు





ఇందిరమ్మ కాలనీలో బురదమయంగా ఉన్న రోడ్లు

నర్సంపేట రూరల్ : వర్షాకాలం వచ్చిందంటే ఆ రోడ్లు మొత్తం పొలం మడుల్లా తయారవుతున్నాయి. ఈ రోడ్ల గుండా కాలనీకి వెళ్లాలంటే నరకమే. అయినా కాలనీవాసులు ప్రత్యామ్నాయం లేక బురదలో నుంచే నడుస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులకు, ఎమ్మెల్యేలకు విన్నవించినప్పటికీ వాళ్లు మారుతున్నారే తప్ప కాలనీ సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నర్సంపేట మండలంలోని సర్వాపురం గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో 2006 కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలకు సుమారు 120 మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలు అందించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించారు. మొదట్లో సుమారు 70 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాయి. క్రమక్రమంగా ఇప్పటి వరకు 100 కుటుంబాల వరకు నివసిస్తున్నారు. కాలనీకి కనీసం రోడ్లు, డ్రెయినేజీల సౌకర్యం లేదు. వర్షాకాలంలో రోడ్లు బురదమయమై కనీసం నడవరాకుండా ఉంటుంది. కాలనీకి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. గ్రామస్థాయి నుంచి అప్‌గ్రేడ్ అయి మున్సిపాలిటీగా ఎదిగినప్పటికీ కనీసం ఆ కాలనీ వైపు కన్నెత్తి చూసేవారే లేరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత పాలకులు పట్టించుకోలేదు

గత బీఆర్‌ఎస్ పాలకులు ఈ కాలనీ సమస్యలపై పట్టించుకోలేదు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా ఇందిరమ్మ కాలనీ మహర్దశ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి సుమారు రెండేళ్లు కావస్తున్నప్పటికీ ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. తెలంగాణలో అతిపెద్ద పండుగ అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఈ నెల చివరి తేదీల్లో ఉందన్నారు. బురదమయంగా ఉన్న రోడ్ల నుంచి ఎలా బతుకమ్మలు పట్టుకొని వెళ్లాలని మహిళలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఉన్నతాధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్లపై నడవలేకపోతున్నాం



బురద రోడ్లపై నడవాలంటే కష్టంగా ఉంది. రోడ్లపై నడుస్తుంటే మోకాళ్ల లోతు వరకు పోతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీ నుంచి బయటకు రావాలంటే చాలా వరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – మాసు స్వామి, కాలనీవాసి

శాశ్వత సీసీ రోడ్లు నిర్మించాలి



కాలనీకి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రాత్రివేళల్లో ఆ గుంతల నుంచి వెళ్తుంటే ఎంతో మంది కింద పడి గాయాలపాలయ్యారు. రోడ్లను లెవలింగ్ చేసి శాశ్వతంగా సీసీ రోడ్లు నిర్మించాలి. – చాతాల రాజేశ్

మంత్రి సీతక్క పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి సీతక్క



నర్సయ్యను పరామర్శిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: కొత్తగూడ మండలం బూర్కగుంపుకు చెందిన మల్లెల నర్సయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడి పట్టణంలోని శ్రీవెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా శనివారం రాత్రి రాష్ట్ర మంత్రి సీతక్క ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా చికిత్స వివరాలను డాక్టర్లు వజ్జ సాగర్, సంపత్‌లను అడిగి తెలుసుకున్నారు. మొదటగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించి యూరియా దొరకకనే ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని ఆరోపించగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన నర్సయ్యను మంత్రి సీతక్క పరామర్శించి అక్కడకు చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కొంత మంది శత్రువులు యూరియా దొరకకనే ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. యూరియా సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మహబూబాబాద్ కలెక్టర్‌తో ఎప్పటి కప్పుడు మాట్లాడుతున్నామని తెలిపారు. నర్సయ్యకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు తెలిపారు.

రైతులు ఎవరూ అధైర్యపడొద్దు

రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, ధైర్యంగా నిలబడి ప్రభుత్వంతో కొట్లాడి పంటలను కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మల్లెల నర్సయ్య నెల రోజులుగా యూరియా కోసం తిరిగి ఒక్క బస్తా దొరకక విసిగిపోయి ఆత్మహత్యాయత్నం చేసుకున్న రైతును శనివారం సాయంత్రం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలను కోల్పోయి అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రావడానికి ప్రధాన కారణం ప్రభుత్వ అసమర్థత అన్నారు. మంత్రి సీతక్క తన నియోజకవర్గ రైతులను కాపాడుకునే స్థితిలో లేకపోవడం దురదృష్టకరం అన్నారు. పాలిచ్చే తల్లులు కూడా యూరియా కోసం క్యూలో నిలబడే పరిస్థితి నెలకొందని తెలిపారు. రైతులకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని, లేదా ఎమ్మెల్యేలు, మంత్రులను గ్రామాల్లో తిరగనివ్వమన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, కొత్తగూడ మండల అధ్యక్షుడు వేణు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దేవోజు సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన నాయకులు



ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిశామని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నరేందర్‌రెడ్డిని కలిసి నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బాలరాంనాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌ల సారథ్యంలో వినతి పత్రం అందించామన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న నెక్కొండకు అన్ని అర్హతలు ఉన్నాయని వేం దృష్టికి తీసుకెళ్లామని రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. నెక్కొండను మున్సిపాలిటీ చేసే విధంగా తనవంతు సహకారాలు అందిస్తామని వేం హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు లావుడ్యా తిరుమల్, ఆవుల శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న రవికుమార్

పర్వతగిరి : విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని స్థానిక ఎస్సీ బాయ్స్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్ అన్నారు. ఈ మేరకు హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, క్రమం తప్పకుండా తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కావాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత స్థాయిలో స్థిరపడి ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా నర్సింగరావు



నియామక పత్రాన్ని అందజేస్తున్న అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం బాధ్యులు

నర్సంపేట: అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం నర్సంపేట డివిజన్ కన్వీనర్‌గా చెన్నారావుపేటకు చెందిన సాధు నర్సింగరావును శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ లీగల్ అసోసియేషన్ బార్ కౌన్సిలింగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ ప్రశాంత ఆదేశాల మేరకు నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మెట యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొరవూడి భాస్కర్‌రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికిరణ్ చేతుల మీదుగా నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్‌గా నర్సింగరావు, కో కన్వీనర్‌గా సింగారపు బావులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర కమిటీల ఆదేశాల మేరకు పని చేయాలని, అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. నర్సింగరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన రాష్ట్ర, జిల్లా, డివిజన్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీత, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ముల దిలీప్, నాగరాజు, చెన్నారావుపేట, నెక్కొండ మండల అధ్యక్షులు గంగిడి కవితరెడ్డి, బొమ్మెర యాదాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కత్తి స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీమాన్

రాయపర్తి : సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం వేడుకలతో పాటు ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పూసల శ్రీమాన్ కోరారు. శనివారం మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షం రోజుల పాటు రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. మెగా రక్తదాన శిబిరాలను, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, జిల్లా నాయకులు గడ్డం నరేందర్, కన్నెకంటి కృష్ణారెడ్డి, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, రాపాక ప్రశాంత్, రాజు, అనిల్, నవీన్, గణేష్, నాగరాజు, సుమన్, అశోక్, రాజశేఖర్, ప్రశాంత్, దినేష్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కొంగర రవి



రవిని అభినందిస్తున్న బీజేపీ జిల్లా నాయకుడు కాళీప్రసాద్

గీసుకొండ : బీజేపీ మండల అధ్యక్షుడిగా శాయంపేట హవేలికి చెందిన కొంగర రవిని నియమిస్తూ ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి పేర గత శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఎలుకుర్తి హవేలికి చెందిన చొక్కం శ్రీనివాస్‌కు ఏడాది పదవీ కాలం పూర్తికా కుండా ఉద్వాసన పలకడంపై మండల బీజేపీలో తీవ్ర చర్చ జరుగుతోంది. పార్టీకి చేటు చేసే ఒకరిద్దరికి ప్రాధాన్యతను ఇస్తున్నారని, మండలంలో పార్టీ తీరుపై ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి రాష్ట్ర నాయకత్వానికి విన్నవిస్తామని ఓ వర్గం వారు చెబుతున్నారు. ప్రాధాన్యత లేని పరిస్థితిలో పార్టీలో ఉండాలా వద్దా అంటూ తమ అభిప్రాయాన్ని పార్టీ నాయకత్వానికి విన్నవిస్తామంటున్నారు. రవిని డాక్టర్ కాళీప్రసాద్ అభినందించారు.

కేజీబీవీకి కుట్టుమిషన్ల బహూకరణ



పాఠశాలకు కుట్టు మిషన్లు బహూకరిస్తున్న రోటరీ క్లబ్ బాధ్యులు

పర్వతగిరి : విద్యార్థినులు చదువుతో పాటు ఇతర నైపుణ్యాలను నేర్చుకోవాలని వరంగల్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కె.శివప్రసాద్ అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి రెండు కుట్టు మిషన్లు వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా రోటరీ క్లబ్ పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ జి.ఎల్లరాజు, పాస్ట్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ఎమ్మార్సీ సీసీ గారె జయరాజ్, కేజీబీవీ సీఆర్‌టీలు సరోజ, సునీత, శోభారాణి, శిరీష, విజయభారతి, స్వప్న, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం వైఫల్యంతోనే యూరియా కొరత



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



వర్ధన్నపేట : మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యం

రాయపర్తి : కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోలేకపోయారని అందువల్లే దేశవ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడిందన్నారు. రైతుల సంక్షేమంపైన మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ నాయకులకు లేదన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి, ఉనికిని చాటుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు మచ్చ రమేష్, నాయకులు సుధీర్‌రెడ్డి, సురేందర్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, వనజారాణి, శ్రీనివాస్, నీలయ్య, రాజయ్య, నర్స య్య, కుమారస్వామి,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం ఆపండి

వర్ధన్నపేట : యూరియా కొరత గురించి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసే అసత్య ప్రచారాన్ని బీఆర్‌ఎస్ నాయకులు ఆపాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా నాయకులు పోశాల వెంకన్నగౌడ్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో తీవ్రమైన ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారన్నారు. కక్షపూరితంగా రాజకీయాలు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడుతారని ప్రతిపక్ష నాయకులను హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి చేయూత

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన బల్ల భిక్షపతి కుటుంబాన్ని మృతుడి కుమార్తె సృజన స్నేహితులు శనివారం పరామర్శించారు. అనంతరం సృజనను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం స్నేహితురాలి కుటుంబ సభ్యులకు రూ.11,500 ఆర్థికసాయంగా అందించారు. అందజేసిన వారిలో శ్రీలత, మౌనిక, లావణ్య, జ్యోతి, రఘు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భిక్షపతి కుటుంబానికి శ్రీభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.3వేలు ఆర్థిక సాయంగా అందించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని కొండూరు, కొండాపురం గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన అడ్లూరి చంద్రకళ, నాయిని సోములు కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, నాయకులు శనివారం పరామర్శించినట్లు తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్‌చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అందించిన బియ్యంతో పాటు, ఆయిల్ క్యాన్‌లను ఆర్థికసాయంగా అందించినట్లు తెలిపారు. అలాగే అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మార కుమారస్వామికి రూ.2వేలు ఆర్థిక సాయంగా అందించినట్లు తెలిపారు. వారి వెంట బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి మధు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, ఎల్లస్వామి, ఉపేందర్ ఉన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : యువకులు రాజకీయంగా ముందుకు వచ్చి గ్రామాల అభివృద్ధి జరిగేలా చూడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పల్‌తండాకు చెందిన పలువురు యువకులు మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాము, సానబోయిన సిద్ధు ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ అధ్యక్షతన రాణాప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ సాధిస్తున్న పురోగతి, జాతీయవాద సిద్ధాంతం నచ్చి ప్రధాని మోదీ నాయకత్వానికి ఆకర్షితులై పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేస్తున్న సేవలు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను గుర్తించి పార్టీలోకి వచ్చేస్తున్నారని తెలిపారు. పార్లమెంటు కో కన్వీనర్ రామచందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మహేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, నియోజకవర్గ కన్వీనర్ రమేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాజు, దేవేందర్, సుమన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



నర్సంపేట రూరల్ : హిందీ భాషలో కవితలు, గేయాలు చార్ట్‌పై రాసి ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నర్సంపేట : హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



రాయపర్తి : హిందీ దివస్‌లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

నర్సంపేట/నర్సంపేట రూరల్ : పట్టణంలోని అక్షర ద స్కూల్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో, మండలంలోని లక్నెపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్‌లో శనివారం ముందస్తుగా ఘనంగా హిందీ దివస్(జాతీయ హిందీ దినోత్సవ) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజలు హాజరై మాట్లాడారు. 1949 భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికారిక భాషగా దేవనాగరి లిపిలో స్వీకరించిన రోజును గుర్తు చేసుకోవడానికి ఈ రోజును జరుపుకుంటారని తెలిపారు. ఈ రోజును హిందీ భాష గొప్పతనాన్ని ప్రోత్సహించేందుకు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. అనంతరం హిందీ భాషోపాధ్యాయుడు ఎండీ.రియాజుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీ, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, అక్షర స్కూల్ ప్రిన్సిపాల్ జి.భవాని, సీఏఓ సురేష్, విష్ణులత, నర్సింహస్వామి, లలిత, ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : స్థానిక సోషల్ వెల్ఫేర్‌లో హిందీ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.సరిత మాట్లాడారు.